సాక్షి
పెద్దపల్లి

బుధవారం ı 27 ı సెప్టెంబర్ ı 2023

నిమజ్జనానికి సర్వం సిద్ధం

జిల్లా కేంద్రంతోపాటు గోదావరిఖని, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జనం చేస్తారు. ఈమేరకు జలవనరుల వద్ద అధికారులు మంగళవారం నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశారు. పెద్దపల్లిలోని మినీ ట్యాంక్‌బండ్‌ను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తానూ ముస్తాబు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



విద్యుత్ దీపాల వెలుగుల్లో పెద్దపల్లిలోని మినీట్యాంక్‌బండ్



గోదావరిఖని : శోభాయాత్రకు ముస్తాబవుతున్న ప్రధాన చౌరస్తా

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం సకాలంలో తరలించాలి



'ఎంఎల్ఎస్' పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వివిధ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు సకాలంలో రేషన్ బియ్యం తరలించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసు అధికారులు

గోదావరిఖని: గణపతి నిమజ్జనోత్సవం, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ తులా శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావుతోపాటు ఎస్ఐలు, స్పెషల్, ఏఆర్ పోలీసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బయలుదేరిన ఫ్లాగ్‌మార్చ్.. ప్రధాన చౌరస్తా మీదుగా రాజేశ్ టాకీస్ వరకు.. అక్కడి నుంచి మళ్లీ ప్రధాన చౌరస్తావరకు కొనసాగింది.

నిమజ్జనానికి భారీభద్రత



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏసీపీ మహేశ్

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: వినాయక నిమజ్జనం కోసం భారీపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పెద్దపల్లి ఏసీపీ మహేశ్ తెలిపారు. స్థానిక పెద్దచెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం ఏసీపీ పరిశీలించారు. క్రేన్లు, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని పోలీసులను ఆదేశించారు. పోలీసుల రూట్‌మ్యాప్ ఆధారంగానే శోభాయాత్ర నిర్వాహించాలని వినాయక మండప నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ చైర్పన్ ముత్యం సునీత, సీఐ జగదీశ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎస్సై విజేందర్, ఏఎస్సై తిరుపతి, నాయకులు ముత్యం రమేశ్, సాజిద్, కానిస్టేబుల్ తిరుపతి నాయక్ ఉన్నారు.

మినీ ట్యాంట్‌బండ్ పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, నేతలు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని మినీట్యాంక్ బండ్(ఎల్లమ్మ, గుండమ్మ చెరువు)లో గణేశుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చేపట్టిన ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ మమతారెడ్డి, ఏసీపీ మహేశ్ తెలిపారు. వారివెంట సీఐ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్ హైస్కూల్ విద్యార్థులు ఖోఖోలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం సుల్తానాబాద్‌లో జరిగిన జోనల్‌స్థాయి అండర్– 17 ఖోఖో పోటీల్లో పి.హర్షిత, కె.విష్ణు, పి.అఖిల్, వై.జశ్వంత్ ప్రతిభ చూపారు. వీరు ఈనెల 29న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, పీఈటీ ప్రణయ్ మంగళవారం తెలిపారు. వారిని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

నల్లసూరీలు మురిసె..

- సింగరేణికి లాభాల జోష్
- కార్మికుల వాటా 32శాతం
- రూ.711కోట్లు చెల్లించేందుకు యాజమాన్యం సన్నద్ధం
- చరిత్రలో ఇదే అత్యధికం
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.2,222 కోట్ల లాభాలు



గోదావరిఖని: సింగరేణి సంస్థ చరిత్రలోనే అత్యధిక లాభాలు గడించి మహారత్న కంపెనీలకు దీటుగా నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.33,065కోట్ల టర్నోవర్ సాధించిన సింగరేణి సంస్థ.. రూ.2,222కోట్లు నికర లాభం ఆర్జించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈఏడాది కార్మికుల లాభాల వాటా రెండుశాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గతేడాది 30శాతం వాటా చెల్లించగా, ఈసారి సాధించిన వాస్తవ లాభాలు రూ.2,222కోట్లలో 32శాతం కార్మికుల వాటాగా రూ.711కోట్లు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు.

పండుగకు శుభవార్త..

- సింగరేణి ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త ప్రకటించారు.
- విజయదశమి పండుగలోగా కార్మికులు, ఉద్యోగులకు సంస్థ లాభాల్లో 32 శాతం వాటాగా అందజేయాలని ఆదేశించారు.
- అర్హులైన సుమారు 42వేల మంది ఉద్యోగులకు దసరా కానుకగా రూ.711 కోట్లను సింగరేణి సంస్థ చెల్లించేందుకు సన్నద్ధమవుతోంది.
- సీఎం నిర్ణయంపై సింగరేణివ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి.. తన ఉద్యోగులకు లాభాల వాటా ప్రకటిస్తూ ఆదేశాలు జారీచేయడంతో పండుగ వాతావరణం నెలకొంది.
- అతిపెద్ద పండుగ దసరాకు ముందే ఉద్యోగులు, సిబ్బందికి లాభాల వాటా చెల్లించే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు.

ఈసారి రెండు శాతం పెంపు..

సింగరేణి సంస్థ తన లాభాల్లో వాటాను కార్మికులకు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది కంటే ఈసారి సంస్థ లాభాల్లో రెండుశాతం వాటా పెంచుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే లాభాల వాటా పెంచినా.. గత మూడేళ్లలో కార్మికులకు లాభాల సొమ్ము పెద్దగా అందలేదు. సంస్థ లాభాలు తగ్గిపోవడంతో లాభాల వాటా పెంచినా.. ఆశించిన మేర ఆర్థిక ప్రయోజనం చేకూరలేదు. అయితే భారీగా లాభాలు రావడం, గతంకన్నా రెండు శాతం అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమతోంది. దీనిద్వారా ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.60లక్షలు లాభాలు వాటాగా అందే అవకాశాలు ఉన్నట్లు వివిధ కార్మిక సంఘాల నాయకులు వివరిస్తున్నారు. మరోవైపు.. ఏఐటీయూసీ నేత కేఎల్ మహేంద్ర కృషితోనే కార్మికులకు లాభాల వాటా సాధ్యమైందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య మంగళవారం తెలిపారు. కార్మికులకు సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు.

ఆర్థిక సంవత్సరం	లాభాలు	కార్మికుల వాటా(శాతం)	మొత్తం సొమ్ము
2015–16	1001.17	23	230.26
2016–17	395.38	25	98.84
2017–18	1212.00	27	327.27
2018–19	1766.00	28	493.00
2019–20	993.00	28	278.04
2020–21	272.20	29	79.06
2021–22	1,227.00	30	368.00
2022–23	2222.00	32	711.00

కేఎల్ మహేంద్ర కృషితోనే..



మా యూనియన్ నేత కేఎల్ మహేంద్ర కృషితో 1999లో సింగరేణిలో లాభాల వాటా ప్రారంభమైంది. అప్పటి నుంచి ఏటా ఒకటి, రెండు శాతం చొప్పున సీఎంలు పెంచుతూ వస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకేసారి మూడు శాతం పెంచారు. కార్మికులు శ్రమించి లాభాలు తీసుకుంటున్నారు.

– సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

వాటా పెంచడం అభినందనీయం



సీఎం కేసీఆర్ స్పందించి సింగరేణి లాభాల్లో 32శాతం వాటా ప్రకటించడం అభినందనీయం. కార్మికులు కష్టపడి ఈసారి సంస్థకు భారీగా లాభాలు తెచ్చిపెట్టారు. సకాలంలో స్పందించి లాభాల వాటా ప్రకటించిన సీఎంకు కార్మికుల తరఫున కృతజ్ఞతలు. కార్మికులు ఇదేస్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత శ్రమించాలి.

– బి.వెంకట్రావ్, అధ్యక్షుడు, టీబీజీకేఎస్

ఎంబీబీఎస్ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం

- 10 రోజుల వరకు ఫౌండేషన్ బోధన
- విద్యార్థులకు వేర్వేరుగా తాత్కాలిక హాస్టళ్లలో వసతి కల్పన



దిశానిర్దేశం చేస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మంగళవారం రెండో బ్యాచ్ ఫస్టియర్ ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. తొలిరోజు హాజరైన మెడికోలతో కాలేజీ ఆవరణ సందడి మారింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబింగ్‌సింగ్ వారిని అభినందించారు. క్రమశిక్షణతో క్రమంతప్పకుండా అందరూ తరగతులకు హాజరుకావాలని సూచించారు. తొలిరోజు ఫౌండేషన్ క్లాసులను ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలు పరిశీలించారు. జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, హెచ్‌వోడీలు అనిల్ శివశంకర్ రాహూలే, అరుణ, భానులక్ష్మి, లక్ష్మీనర్సయ్య, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల వరకు ఫౌండేషన్ కోర్సు..

ఫౌండేషన్ కోర్సుపై ప్రత్యేక క్లాసులను 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్లు తెలిపారు. అనంతరం రెగ్యులలర్‌గా బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, అనాటమీ తదితర విభాగాల థియరీ క్లాసులు ఉంటాయని వివరించారు.

పాత హాస్టళ్లలో వసతి..

ఫస్ట్‌బ్యాచ్ విద్యార్థులకు కేటాయించిన తాత్కాలిక హాస్టళ్లనే సెకండ్ బ్యాచ్‌లో చేరిన స్టూడెంట్స్‌కు స్థానిక శారదానగర్‌లోని హాస్టల్‌ను బాలికలకు, బీగెస్ట్ హౌస్‌లోని హాస్టల్‌ను బాలురకు కేటాయించారు. విద్యార్థులు కాలేజీకి, తిరిగి హాస్టళ్లకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇవే హాస్టళ్లల్లో ఇప్పటి వరకు ఉన్న సెకండియర్ విద్యార్థులను కాలేజీ ఆవరణలో నిర్మించిన రెండు కొత్త హాస్టళ్లకు తరలించారు. మరో మూడు, నాలుగు నెలల్లో మిగతా హాస్టళ్లు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

బల్దియా అభివృద్ధికి మరో రూ.50కోట్లు



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (UBS) DEPARTMENT

ORDER:

ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల కాపీ



మంత్రి కేటీఆర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే చందర్(ఫైల్)

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- తొలివిడతలో గత నెల17న రూ.50కోట్లు విడుదల
- మొత్తం విడుదలైన సొమ్ము రూ.100కోట్లు

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ ద్వారా గతనెలలో తొలివిడతలో రూ.50 కోట్లు మంజూరయ్యాయి. మంగళవారం మరో రూ.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ జీవో నంబర్ 751తో ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులపై ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. గత నెల 17న కూడా నగరపాలక సంస్థ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ ద్వారా తొలివిడతలో రూ.50 కోట్లు మంజూరు చేసింది. వీటికి ప్రతిపాదనలు తయారు చేసిన బల్దియా అధికారులు.. కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. తొలివిడత నిధులతో చేపట్టనున్న పనులకు ఆమోదం పరిశీలన కోసం ప్రభుత్వానికి ఇటీవల కలెక్టర్ నివేదించారు. ప్రభుత్వం కూడా అనుమతులు ఇచ్చిందని సమాచారం. ఈ నేపథ్యంలోనే మరో రూ.50 కోట్లు మంజూరు చేయడంపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇచ్చిన మాట ప్రకారమే..

రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేస్తామని, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రెండు విడతలుగా రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఈఏడాది మే 8న నిర్వహించిన రామగుండం నవ నిర్మాణ సభకు మంత్రి కేటీఆర్ హాజరైన సందర్భంగా, కార్పొరేషన్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని నేను విన్నవించా. బహిరంగ సభలో రూ.100 కోట్లు మాంజూరు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కార్పొరేషన్ అభివద్ధిలో పరుగెడుతోంది. సీఎం, మంత్రికి కృతజ్ఞతలు.

– కోరుకంటి చందర్, ఎమ్మెల్యే

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న జ్యోతి

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో 15రోజులుగా సమ్మె చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి విమర్శించారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు అశ్రిత్, కడారి సునీల్, కుమారస్వామి, శ్రీమాన్, రవీందర్, అశోక్, రాజేందర్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. సమ్మెకు దిగిన అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపాలని జ్యోతి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలేశ్, శోభ, సుగుణాబాయి, రామలక్ష్మి, కృష్ణకుమారి, హరిత, స్వరూప, మహేశ్వరి, చంద్రకళ, ప్రశాంత్, సందీప్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవోలు మధుమోహన్, హనుమనాయక్, తహసీల్దార్లు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

రామగిరి: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంథని జేఎన్టీయూలోని కౌంటింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల నిర్వహణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కళాశాల వరకు భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మంథని ఆర్డీవో హనుమా నాయక్, తహసీల్దార్ రాంచందర్ రావు, ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

2న మెగా రక్తదాన శిబిరం

- ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు రాక
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ, ప్రతినిధులు

సాక్షి, పెద్దపల్లి: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న జిల్లా కేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తలసేమియా బాధితులకు రక్తం లభించక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ఆదుకునేందుకు 'రక్తదానం –ప్రాణదానం' నినాదంతో పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 6006 మంది రక్తదానం చేస్తారని వివరించారు. 21 జిల్లాల రెడ్ క్రాస్ సొసైటీలు, ప్రభుత్వ ఆస్పత్రులకు 6006 యూనిట్ల రక్తం అందిస్తామని చెప్పారు. అక్టోబర్ 2న ఉదయం 7 గంటలకు శిబిరం ప్రారంభిస్తామన్నారు. రక్తదానం చేసేందుకు పెద్దసంఖ్యలో యువతీయువకులు ముందుకు రావాలని ఆమె కోరారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీసులతో కలిసి ప్రచార పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు అనిల్, జగదీశ్, ఎస్సైలు మహేందర్, వెంకటేశ్, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా చైర్మన్ కేశవరెడ్డి, ప్రతినిధులు పడాల రవి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు



పూలమాల వేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. సాయుధ పోరాటంలో పాల్గొని వీరోచితంగా పోరాడిన ఐలమ్మ వీరవనితగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి, రజక సంఘం నాయకులు శ్రీనివాస్, అశోక్, శంకర్, బీసీ నాయకుడు శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ తమిళిసై బీజేపీ ఏజెంట్

ధర్మారం: గవర్నర్ తమిళిసై బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. మండల కేంద్రంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పవిత్రమైన పదవి, ఉన్నత విలువలు కలిగిన పదవిలో కొనసాగుతున్న గవర్నర్.. రాజకీయ నిర్ణయాలు తీసుకోవటం దురదృష్టకరమని విమర్శించారు. ఇప్పటికైనా గవర్నర్ తన తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, బీటీ తిరుపతిరావు, రాజు, రజక సంఘం మండల అధ్యక్షుడు రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో క్వాలిటీ సర్కిల్ సదస్సు

- విజేతగా నిలిచిన ఫారడే జట్టు



విజేత జట్టుతో సీజీఎం కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో 24వ ప్రాజెక్టు లెవల్ క్వాలిటీ సర్కిల్ సదస్సు నిర్వహించారు. టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాల్‌లో మంగళవారం చేపట్టిన సదస్సును చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. 11 బృందాలు తమ ప్రాజెక్టు వివరాలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ చేశాయి. విజేతగా ఫారడే(ఎలక్ట్రికల్ విభాగం), ద్వితీయ స్థానంలో ఫైట్(ఆఫ్‌సైట్ మెయింటనెన్స్), తృతీయ స్థానంలో నిర్మిరామ చక్ర(ఎంజీఆర్ విభాగం) జట్లు నిలిచాయి. విజేత క్వాలిటీ సర్కిల్ సదస్సు సభ్యులను ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్ పాండు అభినందించారు. ఎన్టీపీసీ ఉన్నతికి పలు విధాలుగా ఉపయోగపడే అంశాలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ చేయడం అభినందనీయమన్నారు. సదస్సులో న్యాయ నిర్ణేతలుగా విజయ్‌కుమార్, సంజయ్‌కుమార్, రావత్‌తోపాటు బిజినెస్ ఎక్సలెన్స్ అధికారి ప్రతీక్ తాండ్య, నరేంద, క్వాలిటీ సర్కిల్స్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పట్టించుకోండి



నిరసన తెలుపుతున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలకు పరిష్కారం చూపకపోతే అక్టోబర్ 2నుంచి సమ్మెకు దిగుతామని సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకులు ఖాజా, నాగయ్య, అశోక్, ముస్తఫా, రామస్వామి, నగేశ్, నరేశ్, శారద, రాజయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణేశుని సన్నిధిలో సీపీ పూజలు



గణేశుని సన్నిధిలో సీపీ రెమా రాజేశ్వరి

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఛత్రపతి యువసేన ఏర్పాటు చేసిన 47 అడుగుల ఎత్తుగల గణేశుని విగ్రహాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మంగళవారం దర్శించుకున్నారు. నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న యువసేన అధ్యక్షుడు శివంగారి సతీశ్‌ను అభినందించారు. నిమజ్జన కార్యక్రమాలను మండప నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఏసీపీ మహేశ్, సీఐలు అనిల్, జగదీశ్, ఎస్‌ఐ మహేందర్ పాల్గొన్నారు.

ప్రాణానికి ముప్పు ఉందనడం హాస్యాస్పదం

కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: పుట్ట మధు తన ప్రాణానికి ముప్పు ఉందని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత పేర్కొనడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. నేరచరిత్ర ఉన్న పుట్ట, ఆయన కుటుంబంతోనే మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, అనుచరులకు ప్రాణహాని ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే శ్రీధర్‌బాబుపై పుట్ట మధు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. నియోజవర్గంలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో తెలుసుకోవాలంటే బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూటి రఫీ, గాదం శ్రీనివాస్, చెలుకల జితేందర్, దాసరి చంద్రమౌళి, కొల విజయ్, అల్లం కుమారస్వామి పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



రామగుండం: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రైల్వేస్టేషన్ ఏరియా ఆర్యవైశ్య సంఘ భవనంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సుల్తానాబాద్‌రూరల్: మంచిరామికి చెందిన అవుల లక్ష్మి(56) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యులు కథనం ప్రకారం.. లక్ష్మికి కూతురు, ఇద్దరు కుమారులు సంతానం. కూతురు పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటినుంచి లక్ష్మి మానసికంగా బాధపడుతోంది. ఈనెల 25న ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగింది. కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

మదినిండా.. దేశభక్తి నింపేలా..

- ఆన్‌లైన్‌లో వీరగాథ-3 పోటీలు
- గడువు ఈనెల 30



వీరగాథ లోగో

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థుల మదిలో దేశభక్తి నింపేందుకు భారత విద్య మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్‌లో వీరగాథ-3 పోటీలు నిర్వహిస్తోంది. వారిలోని సృజనాత్మకతకు పదును పెట్టి ప్రోత్సహించేందుకు మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీ మీడియా ప్రదర్శన తదితర పోటీలు నిర్వహిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

అంశాలు..

- వీరగాథ-4 పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అంశాలు ఎంచుకునే అవకాశం కల్పించారు.
- తనరోల్ మోడల్(దేశం కోసం అత్యున్నత త్యాగం చేసి గ్యాలంట్రీ అవార్డు అందుకున్న విజేత)జీవితం నుంచి నేర్చుకున్న విలువలు ప్రస్తావించాలి.
- జ్ఞాపకశక్తిని సజీవంగా ఉంచేందుకు అవకాశం ఇస్తే ఆయన ఏం చేయదలచుకున్నాడో చెప్పాలి.
- రాణీలక్ష్మీబాయి విద్యార్థి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తాడో వివరించాలి.
- 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుడి జీవితకథ ఎలా ప్రభావితం చేసిందో చెప్పాలి.
- స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల తిరుగుబాటుపాత్ర, ఇతర అంశాలను ఎంచుకుని వివరించాలి.

నాలుగు విభాగాల్లో పోటీలు..

- **మూడు నుంచి ఐదో తరగతి :** పద్యం, పేరాగ్రాఫ్(150 పదాలు), పెయింటింగ్, డ్రాయింగ్
- **ఆరు నుంచి ఏడో తరగతి :** పద్యాలు, పేరాగ్రాఫ్(300 పదాలు), పెయింటింగ్, డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన
- **తొమ్మిది నుంచి పదో తరగతి :** పద్యాలు, వ్యాసం(750) పదాలు), పెయింటింగ్, డ్రాయింగ్, మల్టీ మీడియా ప్రదర్శన
- **పదకొండు నుంచి పన్నెండో తరగతి :** పద్యాలు, వ్యాసం(1,000 పదాలు), పెయింటింగ్, డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన.

నమోదు చేయండిలా..

పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయుడ innovateindia,mygov.in/veer-gatha-3 వెబ్‌సైట్‌లో యువర్ ఎంట్రీ ఉన్న చోట క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి అత్యుత్తమమైన నాలుగు ఎంట్రీలు అప్‌లోడ్ చేయాలి. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి పైకిపంపిస్తారు. జాతీయ స్థాయిలో ఒక్కో విభాగంలో 25 మంది చొప్పున అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరికి రూ.10వేలు నగదు, ప్రశంసపత్రం అందజేస్తారు.

మేధస్సుకు పదును



విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రతీపాఠశాల నుంచి పోటీలకు సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులను కోరాం. జిల్లా నుంచి జాతీయస్థాయిలో విద్యార్థులు బహుమతులు సాధించేలా సూచనలు, సలహాలు అందిస్తున్నాం. వారిలో మేధస్సు, దేశభక్తిని పెంచేందుకు ఇది మంచి అవకాశం.

-బి.రవినందన్‌రావు, నోడల్ అధికారి, వీరగాథ-3, పెద్దపల్లి

మంత్రి కొప్పుల దిష్టిబొమ్మ దహనం



మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ధర్మపురి: ఎస్సీల వర్గీకరణ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించేలా పోస్టర్ ఆవిష్కరించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం మంత్రి వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొప్పుల ఈశ్వర్ వర్గీకరణకు వ్యతిరేకంగా గోడ పత్రికలను విడుదల చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని, మాదిగ సామాజిక వర్గానికి మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీల వర్గీకరణకు మూడు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తున్నామని, మాల సామాజిక వర్గానికి మంత్రి కొమ్ముకాస్తూ మద్దతు తెలుపడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అన్ని వర్గాలకు సమ న్యాయం చేయాల్సిన మంత్రి ఒక వర్గానికి కొమ్ము కాయడం ఏమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు మంత్రి ఈశ్వర్‌కు లేదని, ఒకవేళ అడగాలనుకుంటే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీశ్, ముల్కల శ్రీనివాస్, దూడ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపిక పోటీలు ఖరారు

- ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్

జ్యోతినగర్(రామగుండం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరాటే ఎంపిక పోటీల తేదీలు ఖరారయ్యాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లాకు చెందిన పలువురు కరాటే మాస్టర్లతో ఆయన సమావేశమయ్యారు. అక్టోబర్ 14న జిల్లా సెలక్షన్స్ జరుగుతాయన్నారు. 15న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరాటే సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెద్దపల్లితోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపిక పోటీలు రామగుండంలో నిర్వహించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, కరీంనగర్ చాప్టర్ కో ఆర్డినేటర్ తగరపు శంకర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన కరాటే మాస్టర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈమేరకు అండర్- 14, అండర్- 17 ఎస్‌జీఎఫ్ బాలుర కరాటే సెలక్షన్స్ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే నిర్వహించనున్నట్లు కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. అతి త్వరలోనే సెలక్షన్ జరిగే స్థలం వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్లు తగరపు శంకర్, వడ్డేపల్లి సురేశ్, శంకర్, శ్రీనివాస్, నాగరాజు, బోయపోతు రాము, బాలు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఏడాదిన్నర జైలు

గోదావరిఖనిటౌన్: వరకట్న వేధింపుల కేసులో స్థానిక జీఎం కాలనీకి చెందిన వేల్పుల నాగరాజుకు ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని ఒకటో అదనపు జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ దుర్గం గణేశ్ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నాగరాజుకు 2017లో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సుజాతతో వివాహం జరిగింది. ఆ సమయంలో బ్యాంకు ఉద్యోగిగా నమ్మించడంతో రూ.15లక్షల కట్నం, తులం బంగారం, రూ.మూడు లక్షల గృహోపకరణాలు అందజేశారు. కొన్నాళ్లపాటు వీరి కాపురం సజావుగా సాగింది. వీరికి 2018లో కూతురు జన్మించింది. ఆ తర్వాత తన తల్లిదండ్రులు హేమలత, వెంకటేశ్వర్లు.. భార్య సుజాతను శారీరకంగా, మానసికంగా వేధించారు. ఈ మేరకు 2021లో అప్పటి ఎస్‌ఐ, ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. నాగరాజుతోపాటు తల్లిదండ్రులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. సునీల్‌కుమార్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏపీపీ సహేద ఫర్జిన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, కానిస్టేబుల్ తిరుపతి, హోంగార్డు సతీశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఏపీపీ సహేద ఫర్వీన్ ప్రాసిక్యూషన్ తరఫున తన వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారు భర్త నాగరాజుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా, అదనపు వరకట్నం కేసులో ఆరు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని సూచించారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ ప్రమోద్‌రావు, కానిస్టేబుల్ తిరుపతి, హోంగార్డు సతీశ్‌ను గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు అభినందించారు.

చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన అవసరం

- లయన్స్ క్లబ్ ప్రతినిధులు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్యాస శ్రీనివాస్

కోల్‌సిటీ: పిల్లల్లో కేన్సర్‌పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు సూచించారు. గోదావరిఖని జనగామ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం పిల్లల్లో కేన్సర్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ క్యాస శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పిల్లలకు జంక్ ఫుడ్ తినిపించవద్దని కోరారు. ముఖ్యంగా మేనరికం వివాహాలు వద్దన్నారు. దీనిద్వారా పిల్లలకు పుట్టుకతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అలాగే తరచూ స్కానింగ్, ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ తదితర రేడియేషన్ కలిగిన వాటిని తీయించుకోవద్దన్నారు. పిల్లల్లో కేన్సర్లు, వాటిని గుర్తించి, చికిత్స తీసుకునే విధానం, పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, ప్రతినిధులు కళావతి, మనీషా, కార్పొరేటర్ కవితాసరోజిని తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికల సమరానికి సై

గోదావరిఖని: సింగరేణి గురింపు సంఘం ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉన్నామని బీఎంఎస్ నాయకుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. నగరంలో ఆయన మంగళవారం విలేకరుతో మాట్లాడారు. యాజమాన్యం వేసిన పిటిషన్ డిస్మిస్ చేయడంతోపాటు ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని ఆయన కోరారు.

బొగ్గుబాయి వార్తలు

ఎన్నికల వాయిదాకు ప్రయత్నాలు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కుంటిసాకులతో సింగరేణి గుర్తింపు ఎన్నికలను వాయిదావేసేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఆదేశం ప్రకారం తక్షణమే సింగరేణిలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలు చేసి 1998 నుంచి ఎన్నికలు నిర్వహించిన యాజమాన్యమే.. డిస్‌ప్లేన్ తప్పి కాలపరిమితి ముగిసినా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టులో కేసు వేసి న్యాయపోరాటం చేస్తున్నామని అన్నారు. అక్టోబర్‌లోగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు ఎల్.ప్రకాశ్, ముస్కె సమ్మయ్య, స్వామి, కందుకూరి రాజారత్నం, సంకె అశోక్, ఎస్.వెంకట్‌రెడ్డి, ఎండీ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజి రెడ్డి



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికుల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో మంగళవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కార్మికులకు అత్యధిక లాభాలు రావడానికి కృషి చేసిన యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కవిత, కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, మల్లికార్జున్, బేతి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జీడీకే-5 ఓసీపీని సందర్శించిన డైరెక్టర్



క్వారీ తీరును పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: రామగుండం డివిజన్-1 పరిధి జీడీకే-5 ఓసీపీని డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. వ్యూ పాయింట్ ద్వారా ప్రాజెక్టు క్వారీ ఆసాంతం పరిశీలించారు. భవిష్యత్‌లో చేపట్టే పనుల గురించి సూచనలు, సలహాలు అందించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణతో విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్, ఇంజినీర్ ఎన్ వీరావు, మేనేజర్ అనిల్‌గభాలే, సర్వేయర్ అశోక్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమంలో సింగరేణి అధికారులు, భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 బంగ్లాస్ ఏరియాలోని మట్టిగణపతి మండపంలో మంగళవారం హోమం నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకె శ్రీనివాస్-కల్యాణి దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ-మాలతి, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్-పద్మ, జీఎం(రెస్క్యూ) వెంకటేశ్వర్లు-పద్మ, ఏఎల్పీ జీఎం కే వెంకటేశ్వర్లు-విజయలక్ష్మి, మందమర్రి జీఎం ఎ.మనోహర్-సవితా దంపతులు, రీజియన్ జీఎం ఎస్.సాంబయ్య, ఏసీఎంవో కిరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజర్‌తో ఉద్యోగాలు కోల్పోవద్దు

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

గోదావరిఖని: ఎంతోకష్టపడితేనే ప్రస్తుతం ఉద్యోగాలు లభించడం లేదని, గైర్హాజరు పేరిట విలువైన ఉద్యోగాలు కోల్పోవద్దని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఆర్సీవోఏ క్లబ్‌లో గైర్హాజరైన 199మంది కార్మికులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే సింగరేణి ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని విధులకు హాజరు కావాలన్నారు. నిర్దేశిత మస్టర్లను పూర్తిచేస్తేనే ఉద్యోగానికి ఇబ్బంది ఉండదని తెలిపారు. మూడేళ్ల గైర్హాజరును పరిగణనలోకి తీసుకొని విధుల నుంచి తొలగిస్తారని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, రంగు శ్రీనివాస్, సాగర్, మెండె శ్రీనివాస్, రవీందర్, ఆకుల హరీశ్, డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, హెల్త్ అధికారి సుమన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నరేన్ చక్రవర్తి, సీనియర్ పీవో బంగారు సారంగపాణి, కో ఆర్డినేటింగ్ అధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

కుర్జుకమ్మి భూపట్టాలు సిద్ధం చేస్తున్నాం

- అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోండి
- పెద్దంపేట గ్రామసభలో ఆర్డీవో మదన్‌మోహన్



మాట్లాడుతున్న ఆర్డీవో మదన్‌మోహన్

రామగుండం: పెద్దంపేట, రాయదండి గ్రామ శివారులో ఇటీవల సర్వే చేసిన కుర్జుకమ్మి లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేస్తున్నామని పెద్దపల్లి ఆర్డీవో మదన్‌మోహన్ తెలిపారు. అంతర్గాం మండలం పెద్దంపేటలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 60ఏళ్ల క్రితం అజామాబాద్ ఇండస్ట్రియల్ పేరిట నిజాం హయాంలో సేకరించిన భూములను లబ్ధిదారులకు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అయితే, రాజకీయాలకు తావులేకుండా లబ్ధిదారులకు జాగ్రత్తగా భూములు అప్పగించాలని సూచించారు. ఇందు కోసమే 15రోజులుగా రెండు గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో భూసర్వే చేశామని, సుమారు 560 మంది రైతులు కబ్జాలో ఉన్నట్లుగా గుర్తించామని వివరించారు. సర్వేలో అభ్యంతరం ఉంటే బుధవారం అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరం లేని సర్వే నంబర్లలో కబ్జా(రైతులు)లో ఉన్నవారి పేరిట పట్టాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాలు పంపిణీ చేస్తామని ఆర్డీవో వెల్లడించారు. సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ అధ్యక్షత వహించగా తహసీల్దార్ వనగంటి రామ్మోహన్‌రావు, ఆర్‌ఐ రాజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఉప సర్పంచ్ కోడి పుంజుల భూమేశ్, రాయదండి సర్పంచ్ ధర్మాజి కృష్ణ, ఎంపీటీసీ కొలిపాక శరణ్య, పాలకవర్గ సభ్యులు హాజరయ్యారు.

'బీఎంఎస్ పోరాటాలతోనే కార్మికులకు వాటా'

రామగిరి: సింగరేణి కార్మికుల పక్షాన బీఎంఎస్ పోరాటం చేయడంతోనే కార్మికులకు 32 శాతం లాభాల వాటా చెల్లిస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం సెంటనరీకాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం బీఎంఎస్ ఎల్లవేళలా పోరాటం చేస్తుందని అన్నారు. దీంతోనే సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా చెల్లించాలని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. కార్మికులతో కలిసి ప్రత్యక్ష ఉద్యమాలు చేయడంతోనే సింగరేణి యాజమాన్యం దిగివచ్చి లాభాలు చెల్లిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్, నాయకులు మామిడి స్వామి, విద్యాసాగర్ పాల్గొన్నారు.









మంత్రులు వస్తున్నారని..

మున్సిపల్ సిబ్బంది రోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ శ్రమిస్తున్నారు. హరిత పట్టణంగా, పచ్చని ప్రాంతంగా తీర్చి దిద్దుతున్నారు. డివైడర్ల మధ్యలోని గడ్డి తొలగిస్తున్నారు. ఆకట్టుకునే మొక్కలు నాటుతున్నారు. గోడలు, ప్రధాన కూడళ్లకు రంగులు అద్దుతున్నారు. ప్రధాన వీధులన్నింటినీ శుభ్రం చేస్తున్నారు. దీనంతటికీ కారణం అక్టోబర్ ఒకటిన మంత్రి కేటీఆర్, 2న మంత్రి హరీశ్‌రావు పర్యటనలు ఉన్నాయి. దీంతో పెద్దపల్లిని ఇలా తీర్చిదిద్దుతున్నారు. మంత్రులు రెండునెలకోసారి ఇలా పర్యటిస్తే బల్దియా ఎంత అందంగా ఉంటుందోనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి